క్లుప్తంగా

కార్మిక నాయకుడు ధర్మారెడ్డికి నివాళులు


చిల్ల ధర్మారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి చిల్ల ధర్మారెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అంబేడ్కర్ కూడలిలోని కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద పలువురు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నీలాపు శంకరరెడ్డి, అక్కరమాని కిరణ్, చిల్ల బాబయ్యరెడ్డి, మునకాల ఆదినారాయణ, దల్లి అప్పలరెడ్డి, చిల్ల ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌ప్రసాద్

ఆనందపురం : స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో శుక్రవారం భీమిలి సబ్ డివిజన్‌లో గల ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాలకు సంబంధించిన వ్యవసాయ శాఖ సిబ్బంది వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఎంపీఈవోలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా, పీఎం ఫసల్ బీమా యోజన పథకం, పంటకోత ప్రయోగాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ ఏడీఏ విజయ్‌ప్రసాద్, భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండల వ్యవసాయాధికారులు శశికళ, సింహాచలం, సంధ్యారత్నప్రభ, డీఎస్‌వో జగన్నాథం, ఏఎస్‌వోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు


విద్యార్థి కంటిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ఆనందపురం : మండలంలోని నేలేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం శ్రీసత్య సాయి సేవా సంస్థలు విశాఖ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 245 మందికి పరీక్షలు నిర్వహించారు. మోషన్ స్కూల్ హెల్త్ ఐకేర్ ప్రాజెక్ట్ తరఫున విశాఖ ఆస్పత్రి ట్రస్ట్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 10 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి ఉచితంగా కళ్లద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ కో–ఆర్డినేటర్ ఎం.వి.సత్యసాయికుమార్, ఆనందపురం భజన మండలి సేవాదళ్ కో–ఆర్డినేటర్ ఇ.సాయికృష్ణకుమార్, విశాఖ కంటి ఆస్పత్రి సిబ్బంది వంశీకృష్ణ, విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ పాల్గొన్నారు.

ఒక నామినేషన్ తిరస్కరణ

ఆనందపురం : మండలంలోని వివిధ పంచాయతీలలో ఖాళీ అయిన వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్లలో ఒక నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఎంపీడీవో అడపా లవరాజు పరిశీలన జరిపి వెల్లంకి పంచాయతీ 12వ వార్డు స్థానానికి రెండు నామినేషన్లు దాఖలు కాగా గొలగాని రాము అనే అభ్యర్థి నామినేషన్‌తో సరైన పత్రాలను సమర్పించలేదు. దీంతో ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. వెల్లంకి పంచాయతీ 6వ వార్డు, కణమాం పంచాయతీ 3వ వార్డు, పాలవలస పంచాయతీ 1వ వార్డు స్థానాలకు ఒక్కో నామినేషను దాఖలు కాగా అన్నీ సక్రమంగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని అధికారులు వెల్లడించారు.

చకచకా రైతుబజారు నిర్మాణం

- గాంధీ జయంతి నాటికి అందుబాటులో..
- రూ.72 లక్షలతో రక్షణ గోడ పూర్తి
- జోరుగా విద్యుదీకరణ, ఫ్లోరింగ్ పనులు


రైతుబజారులో నిర్మాణం పూర్తయిన దుకాణాలు


గ్రంథాలయ వీధిలో నిర్మితమైన రైతుబజారు

తగరపువలస: స్థానిక గ్రంథాలయ వీధిలో రూ.78 లక్షలతో నిర్మిస్తున్న రైతుబజారు గాంధీ జయంతి నాటికి ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ తెలిపారు. రెండేళ్ల క్రితం అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు రైతుబజారు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఈ ప్రాంతంలోని సత్యనారాయణపేట వాలు ప్రాంతంలో రక్షణగోడ కూలిపోవడంతో హుటాహుటిన రూ.72 లక్షలతో నిర్మించారు. రక్షణగోడ కూలిపోవడంతో నిర్మాణంలో ఉన్న రైతుబజారుపై మెటీరియల్ పడటంతో కొంతమేర నష్టం వాటిల్లింది. అలాగే స్థలం కూడా రక్షణగోడ నిర్మాణంలో కలిసిపోయింది. దీంతో రైతుబజారు నిర్మాణానికి రెండేళ్ల వ్యవధి తీసుకుంది. ప్రస్తుతానికి కూరగాయలు, ఆకుకూరల విక్రయానికి 15 దుకాణాలు పూర్తవగా, మరో 15 దుకాణాలు నిర్మాణంలో ఉన్నాయి. ప్రొవిజనల్ స్టోర్‌కు 11 దుకాణాలు నిర్మించగా మరో 5 దుకాణాలు నిర్మిస్తున్నారు. టాయిలెట్లు, ఆర్వో ప్లాంట్, స్టోర్ రూమ్, కార్యాలయం, కాపలాదారులకు కలిపి అయిదు నిర్మాణాలకు మూడు పూర్తయ్యాయి. వీటికి విద్యుదీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇంకా మెయిన్‌గేట్, ఆవరణలో టైల్స్‌తో ఫ్లోరింగ్ పనులు జరగవలసి ఉంది.

నిర్మాణం జరుగుతున్నా ఆరోపణలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం రైతుబజారు నిర్మాణానికి శిలాఫలకం వేసి, ప్రస్తుతం 75 శాతం పనులు పూర్తయినా ఇక్కడ రైతుబజారు లేదంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల టీడీపీ చేపట్టిన బస్సుయాత్రలో రైతుబజారు వైపు చూడకుండానే, రైతుబజారు నిర్మించలేదంటూ మొసలి కన్నీరు కార్చారు. మరొకవైపు టీడీపీ, జనసేన నాయకులు తమకు అనుకూలంగా ఉన్న పత్రికలలో రైతుబజారు నిర్మించాలంటూ ప్రకటనలు ఇస్తున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి తగరపువలసలో రైతుబజారును భీమిలి ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికి ఏడు సార్లు టీడీపీ, ఒక్కోసారి కాంగ్రెస్, పీఆర్పీల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి, మంత్రులుగా పనిచేసినా ఇక్కడి ప్రజల కల నెరవేర్చలేదు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న రైతుబజారు నిర్మాణ పనులు వారి కంటికి కనిపించడం లేదంటూ ఇక్కడి ప్రజలు విమర్శిస్తున్నారు.

దళారీల బెడద తగ్గుతుంది



విశాఖ, విజయనగరాలతో పోలిస్తే తగరపువలస ప్రైవేట్ మార్కెట్‌లో కూరగాయల ధరలు అధికం. ఇప్పుడు మరో ఆరు వారాలలో రైతుబజారు అందుబాటులోకి రానున్నందున దళారీల బెడద తగ్గి కూరగాయలు, ఆకుకూరల ధరలు అందుబాటులోకి రానున్నాయి.

– దువ్వి రాజు, డ్రైఫ్రూట్స్ వ్యాపారి, తగరపువలస

త్వరలో కొత్త ఓపెన్ జిమ్ పరికరాలు


దెబ్బతిన్న పరికరాలను పరిశీలిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: భీమిలి బీచ్ వద్ద కొత్త ఓపెన్ జిమ్ పరికరాలను త్వరలో ఏర్పాటు చేస్తామని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. శుక్రవారం ఉదయం బీచ్ వద్ద దెబ్బతిని ఉన్న జిమ్ పరికరాలను వాకర్స్‌తో కలిసి పరిశీలించారు. తొలుత టెన్నిస్ క్లబ్ సభ్యులు, మూడో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధతో ప్రస్తుతం ఉన్న జిమ్ పరికరాలను ఏర్పాటు చేయించారన్నారు. కానీ అవి దెబ్బతినడంతో, కొత్తవాటిని ఏర్పాటు చేయవలసి ఉందని ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేయిస్తామని తెలిపారన్నారు. దీనిపై జెడ్సీ మాట్లాడుతూ ఇక్కడ త్వరలోనే అవసరమైన కొత్త పరికరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోట మల్లికార్జునరావు, కాళ్ల సన్ని, పార్వతీశం, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వర్షపు నీటిని సేకరిస్తేనే భవిష్యత్తు



మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ ఆంజనేయులు

భీమునిపట్నం: ప్రస్తుత పరిస్థితుల్లో నీటివనరులను పెంచకోవలసిన అవసరం ఎంతో ఉందని డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఆంజనేయులు అన్నారు. ఇందుకోసం వర్షపు నీటిని సేకరించుకుంటేనే అందరికీ భవిష్యత్తు ఉంటుందన్నారు. 'భూగర్భ జలాలు పెంపొందించుకోవడం – దాని ఆవశ్యకత' పై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద శుక్రవారం నిర్వహించిన సదస్సులో ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో నీటి సమస్య చాలా తీవ్రరూపం దాల్చే పరిస్థితులు ఉన్నాయని, దాన్ని ఇప్పటినుంచే ఎదుర్కోవలసిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్‌పాండే, డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్, సీనియర్ పాత్రికేయుడు ఎన్.నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ నీటి వనరులను కాపాడుకునే విషయంలో అందరూ కలసికట్టుగా ప్రయత్నించి, చర్యలను తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా యువ అధికారి మహేశ్వరరావు, ధరణి సొసైటీ వ్యవస్థాపకుడు బి.హరివెంకటరమణ, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత ఆర్.లీలాప్రసాద్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

కు. ని. ఆపరేషన్లు పున: ప్రారంభం


ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న రాంబాబు, గిరిబాబు

పద్మనాభం : రేవిడి పీహెచ్‌సీలో ఇక నుంచి మహిళలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవచ్చని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు తెలిపారు. నాలుగేళ్ల క్రితం ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిలిచిపోయాయి. మళ్లీ శుక్రవారం వీరు ఆపరేషన్ థియేటర్ ప్రారంభించి వీటికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాంబాబు, గిరిబాబు మాట్లాడుతూ మహిళలు విజయనగరం, విశాఖపట్నం వెళ్లి వ్యయ ప్రయాసలకు గురి కాకుండా రేవిడి పీహెచ్‌సీలోనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవాలన్నారు. ఆపరేషన్లు చేయించుకోదలిచే వారు ముందుగా పీహెచ్‌సీకి తెలియజేయాలన్నారు. అనంతరం ఆరుగురు మహిళలకు వైద్యులు కుంటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భాను, స్వప్న, మణికుమారి పాల్గొన్నారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు


పార్కులో తుప్పలు తొలగిస్తున్న క్లబ్ ప్రతినిధులు

పీఎం పాలెం : జీవీఎంసీ ఉద్యానవనాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దామోదర ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం పీఎం పాలెం తులసీనగర్ పార్కులో పేరుకు పోయిన తుప్పలు, చెట్టు కొమ్మలను శ్రమదానంతో తొలగించారు. ఉద్యాన వనాల శాఖ ప్రతినిధి గాసిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యాన వనాల శాఖ సూపర్‌వైజర్ రాఘవ, తులసీనగర్ ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు గాదె రోశిరెడ్డి, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, బోర్డు మెంబర్ షేక్ దావూద్, నరసింగరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

హైవేలో మొక్కలు నాటిన దివీస్ ఉద్యోగులు


మహరాజుపేట వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం శుక్రవారం జాతీయరహదారికి ఇరువైపులా మహరాజుపేట కూడలి నుంచి ఆనందపురం వరకు 3వేల మొక్కలను నాటారు. కార్యక్రమాన్ని సంస్థ డైరెక్టర్ దివి మధుసూదనరావు మహరాజుపేట కూడలి వద్ద ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మొక్కలు నాటడం వలన త్వరగా పెరిగి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, డీజీఎం ఎస్.బాలాజీ, మేనేజర్ ప్రసాద్, సీఎస్ఆర్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, పి.శేఖర్‌బాబు, పి.పైడినాయుడు, హైవే అధికారులు రామస్వామి, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెప్పింది చేసి చూపించే నేత మన జగనన్న


చంద్రంపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి
- చంద్రంపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మధురవాడ : ఒక మాట చెబితే.. అది ఎంత కష్టమైనా చేసి చూపించే నాయకుడు మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా ఎన్నో చేసి చూపించిన నాయకుడు సీఎం జగన్ అన్నారు. చంద్రబాబు గతంలో డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పి చెయ్యలేదన్నారు. అందుకే గత ఎన్నికల్లో అతనికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. మన పాలన దేశంలో అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని, దురదృష్టవశాత్తు ప్రతిపక్షాలు అభినందించాల్సింది పోయి తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. సినిమా పార్టీలు, అబద్ధాల పార్టీలను నమ్మవద్దన్నారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య, బస్ స్టాపుల్లో బస్సులు ఆగటం లేదని, హైవేపై సెంటర్ గ్రిల్స్ ఏర్పాటు వలన రోడ్డు దాటడానికి చిన్న సందు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన నాయకులకు మహిళలు హారతులు పట్టారు. స్థానికులు పూర్ణకుంభం, బాణసంచాతో ఘనంగా స్వాగతం పలికారు. వార్డులో 14 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసిన అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావుతో పాటు ఇతర నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ మారుతీ ప్రసాద్, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కుడితి రామారావు, సింహాచలం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, పీవీజీ అప్పారావు, పిల్లా చంద్రశేఖర్, జగ్గుపిల్లి నరేష్, బెల్లాపు పాపారావు, తమ్మినేని వరలక్ష్మి, పోతిన పైడిరాజు, ఎంపీ రమణమూర్తి, పిల్లా పోతురాజు, జగ్గుపిల్లి అప్పారావు, పిల్లా అప్పన్న జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఆర్ఐ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేలతల్లికి ప్రణామం.. వీరులకు వందనం

వాడవాడలా 'నా భూమి – నా దేశం'


దాకమర్రి హైస్కూల్‌లో నేవల్ అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ వాసురాజు తదితరులు


శింగనబందలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు తదితరులు


తాటితూరు జడ్పీహైస్కూల్‌లో కలశంతో మట్టి సేకరిస్తున్న ఎంపీడీవో వెంకటరమణ తదితరులు


మట్టిపాత్రలతో భూమాతకు పూజలు చేస్తున్న రాయిప్పాలెం హైస్కూల్ విద్యార్థులు

తగరపువలస: నేలతల్లికి వాడవాడలా ప్రజలు ప్రణామాలర్పించారు. మాతృభూమి కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు వందనాలు సమర్పించారు. నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోడమెట్టపాలెం, దాకమర్రి, లక్ష్మీపురం, శింగనబంద, పెదనాగమయ్యపాలెం, తాటితూరు, మూలకుద్దు పంచాయతీలలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. శిలాఫలకాలు ఆవిష్కరించి కలశాలతో మట్టిని సేకరించారు. జాతీయ గేయాన్ని, గీతాన్ని ఆలపించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో వెంకటరమణ, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హాజరైన నేవల్ అధికారులు

భీమిలి మండలంలోని ఏడు పంచాయతీలలో శుక్రవారం జరిగిన నా భూమి – నా దేశం ముగింపు వేడుకలకు భీమిలి నేవల్ స్టేషన్ (ఐఎన్ఎస్ కళింగ)కు చెందిన 13 మంది అధికారులు హాజరయ్యారు. వీరు ఆయా ప్రాంతాల్లోని విద్యార్థులకు దేశభక్తి, స్వాతంత్య్ర సమరయోధుల గురించి వివరించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కమాండర్ విల్ల మణికంఠ, ఎం.బిరడార్, పల్లి దిలీప్, వైవీ రావు, కేవీ రావు, చీపురుపల్లి వెంకటరమణ, పి.రామకృష్ణ, కొల్లా రాంబాబు పాల్గొన్నారు.

రాయప్పాలెం హైస్కూల్లో..

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు నేలతల్లికి వందనాలు అర్పించారు. పాఠశాలలో మట్టి పాత్రలు తయారు చేసి భూమాతకు పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వేములవలస, బోని, వెల్లంకి, తర్లువాడ, గిడిజాల, పందలపాక, మామిడిలోవ, రామవరం, శొంఠ్యాం, పాలవలస, పేకేరు, శిర్లపాలెం, గండిగుండం, కణమాం పంచాయతీలలో నా భూమి–నాదేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటారు. మట్టిని సేకరించి మండల పరిషత్ కార్యాలయానికి అందజేశారు. బోనిలో మాజీ సైనికులు బోని సన్యాసి నాయుడు, బుగత శ్రీనును గ్రామస్తులు సన్మానించారు.

ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ఉండాలి

పద్మనాభం : ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి.రవికుమార్ అన్నారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. నాదేశం–నాభూమి కార్యక్రమం నిర్వహించి వీరులకు మట్టి దీపాలతో వందనం చేశారు. విద్యార్థినులకు కాస్మోటిక్ కిట్లు పంపిణీ చేశారు. సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ శ్రీనివాసరావు, జీసీడీవో కాలేషా బేగం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యురాలు లక్ష్మి, ఎస్‌వో గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

- బి.ఆర్.తాళ్లవలసలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు పాల్గొన్నారు. రేవిడిలో ఎంపీటీసీ సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన రమణ, వెంకటాపురంలో సర్పంచ్ కర్రి రమణ శిలాఫలకాలనుఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో ఎం.విజయకుమార్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వరలక్ష్మి, ఈసీ తులసి పాల్గొన్నారు.


బోనిలో మాజీ సైనికులకు సన్మానం


శొంఠ్యాంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు


బి.ఆర్.తాళ్లవలసలో శిలాఫలకం ఆవిష్కరణ

ట్రేల్లో నారు పెంపకంతో తెగుళ్ల నివారణ

ఆనందపురం : మడుల్లో కాకుండా ట్రేల్లో నారు పెంచితే వేరుకుళ్లు తెగులు నివారించవచ్చని ఉద్యానవనాల శాస్త్రవేత్త ఎం.సత్తిబాబు చెప్పారు. మండలంలోని వేములవలస రైతు భరోసా కేంద్రంలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ట్రేల్లో నారు మొక్కల పెంపకంపై పలువురు రైతులకు శిక్షణ అందించారు. ఆయన మాట్లాడుతూ కూరగాయల నారుకు ఎక్కువగా వేరు కుళ్లు తెగులు ఆశిస్తుందని, ట్రేల్లో పెంపకం వలన నాణ్యమైన నారు లభ్యమై అధికోత్పత్తి సాధించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఎస్.రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు ఎస్.కిషోర్‌కుమార్, కె.శంకరరావు, ఏపీఎంఐపీ పీడీ రహీం, వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ, ఉద్యానవనాల అధికారి సోనీ, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ సూర్యకుమారి, నాయకులు కోరాడ రాంబాబు, కోన శ్రీను, వ్యవసాయ సహాయకుడు అహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

అనిట్స్‌లో అతిథి ఉపన్యాసం

తగరపువలస : సంగివలస అనిట్స్‌లో శుక్రవారం కెమికల్ విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. 'ట్రబుల్ షూటింగ్– కేస్ స్టడీస్ ఇన్ పెట్రోలియం ఇండస్ట్రీస్'అనే అంశంపై సౌదీ అరేబియాలోని పెట్రో కెమ్యాకు చెందిన లీడ్ ప్రాసెస్ ఇంజినీర్ టి.శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి వర్చువల్ పద్ధతిలో మాట్లాడారు. ఫండమెంటల్స్ వినియోగం, పాలీ రియాక్టర్ వినియోగం –ఉపయోగాలు, రిఫ్రిజిరేషన్ సిస్టం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆర్. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శారదా మాతకు విశేష పూజలు

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో గల అంజనాద్రిపై వెలసిన శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువు దీరిన శారదా మాతకు శుక్రవారం విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. మఠం గౌరవ ధర్మాధికారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాల నడుమ అభిషేకాలు నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నగరానికి చెందిన జ్యోతి కుటుంబ సభ్యులు శ్రీవారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ


మద్దిలో పాడి రైతుల కుటుంబ సభ్యులకు జనశ్రీ చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం : మండలంలోని మద్ది పాల ఉత్పత్తిదారుల సంఘ కార్యాలయంలో మృతి చెందిన పాడి రైతులు కె.బంగారునాయుడు. బి.బంగారు నాయుడు, కె.సన్యాసిరావుల కుటుంబ సభ్యులకు జనశ్రీ ఇన్సూరెన్స్ పథకం కింద ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున చెక్కులను ఎంపీపీ కంటుబోతు రాంబాబు శుక్రవారం పంపిణీ చేశారు. మృతుడు ధర్మవరపు సూరప్పడు కుటుంబానికి పాల ఉత్పత్తిదారుల సంఘం తరఫున రూ.60 వేలు, ఆవులు మృతి చెందిన కె.రమణ, కె.శిమ్మయ్య, టి.జానకిరామయ్య, జామి నారాయణలకు రూ.1.51 లక్షలు ఎంపీపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కనకల ప్రకాష్ పాల్గొన్నారు.